# 'మనసులేని పిలుపులు'

మన దైనందిన జీవితంలో మనం అవసరంలేని పలకరింపులు చేస్తుంటాం. నిజాయితీ లేని ఆహ్వానాలందిస్తూంటాం.

సభ్య సమాజంలో అలాంటి కృత్రిమమైన పలకరింపులూ. ఆహ్వానాలూ అనివార్యమై పోయాయి. అవి ఎంత కృతకంగా వుంటాయో మనందరికీ క్షుణ్ణంగా తెలుసు.

సినిమా థియేటర్లో ఇంటర్వెల్లో కనబడిన పరిచయస్తుడ్ని పట్టుకుని "హిహ్హిహీ సినిమా కొచ్చారా?'' అంటూ పలకరిస్తాం. ఏదో పనిమీద ఆదరాబాదరాగా పరిగెత్తుతున్నప్పుడు దార్లో మనలాగే పరిగెత్తుతున్న పరిచయస్తుడెదురైతే, అతడో మనమో లేదా యిద్దరూనూ ఆగి, మొహమాటానికి పళ్లికిలించి పలకరించుకుంటాం.

"రండీ కాఫీ తాగుతూ మాట్లాడకుందాం" అని ఎవరమో ఒకరం పిలుచుకుంటాం. అందులో నిజాయితీ అస్సలుండదు.

మొహమాటానికి మనమో ఆ ఎదురుపడిన వ్యక్తో 'పదండి' అని హోటెల్లోకి దారితీస్తే! అంతే... అటూ యిటూ యిరుపక్షాలకీ ఓ అరగంట సమయం బూడిదౌతుంది. దానిపైన ఓ పది రూపాయలూ వదుల్తాయి.

ఇలాంటి సాధారణ విషయాలు బైటికి గంభీరంగా కనిపించకపోవచ్చు. కానీ ఆ అరగంటలో ఏమైనా కావచ్చు.

ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ కదా సందడే సందడి. ఎంతో విలువైన పత్రికలు అచ్చు వేయించి వాటికి అత్తర్లు రాసి ఆహూతుల లిస్ట్ తయారుచేసి, అన్నింటి మీదా అడ్రసులు రాసి ఇంటింటికీ తిరిగి పత్రికలందించి వచ్చేస్తారు. రోజుకు రెండు మూడు లగ్నాలు. ఉదయం 11.15 ని.కి ఓ పెళ్లి ఓ సత్రంలో (సారీ ఫంక్షన్ హాల్లో) 11.45కు, యింకో పెళ్లి ఈ సత్రానికి ఓ మూడు కిలోమీటర్ల దూరంలో. ఎండలు... చెమట... ఆడవాళ్లకింకా యిబ్బంది... పట్టుచీరలు నగలమోత... ఎక్కడికీ...? ఈ పెళ్లికా? ఆ పెళ్లికా? దేనికి వెళ్లకపోయినా బావుండదు (ఏం బావుండదో ఎంత గింజుకు చచ్చినా నాలాంటి బ్రహ్మచారులకు అర్థంకాదు) తీవ్రమైన మానసిక ఒత్తిడి.

ఇవేం మానవ సంబంధాలు?

అస్సలు నిజాయితీ లేనివి.

ఇది ఏదో ఒక తరగతికి చెందిన వ్యక్తులకు ప్రత్యేకం కాదు. అన్ని తరగతుల్లోనూ యిదే... మరీ అట్టడుగున వున్న వాళ్లకుంటాయా? (అయినా వాళ్ల సంగతి మనకెందుకండీ... మనం సభ్య సామాజికల గురించి కదా మాట్లాడుకుంటున్నాం)

* * *

. మొన్న మా కృష్ణారెడ్డి బార్‌కు వెళ్లాను. టేబిల్ కోసం వెదుకుతూంటే 'హెలో' అన్న పిలుపు వినబడింది. మసకచీకట్లో కళ్లు చిట్లించిచూసా. టెలిఫోన్స్ ఇంజనీర్ ప్రసాదు... మా యిద్దరి మధ్యా ముప్ఫై సంవత్సరాల పరిచయం వుంది. (స్నేహం కాదు) నేనూ పళ్లికిలించి 'హలో' అన్నా.

'రా కూచో' అని కుర్చీ చూపించాడతను. అప్పటికే అతనిదైపోయింది. బేరర్ వచ్చి ఓ పెద్ద పొట్లాల సంచీ బిల్లూ కూడా యిచ్చాడతనికి. ఆ సంచీ చూపించి... "హిహ్హిహీ యింట్లో మా ఆవిడను వంట చేయకు అని చెప్పొచ్చా పిల్లలకీ ఆమెకీ భోజనం" అన్నాడతను. అనీ ఊరుకున్నాడా 'బేరర్ అని గావుకేక వేసి నాకోసమని యింకో రౌండ్ ఆర్డరు చేసాడు. అంతే దాం తర్వాత అతను ఇంటికి బయల్దేరేప్పటికి పదకొండున్నరా పన్నెండు అయ్యింది. అతని భార్యాపిల్లలు, భోజనానికి కాచుక్కూచుని చూసీచూసీ ఎట్లా అసహనంగా చచ్చుంటారు? ఏమనుకుంటారు? ఎవరు కోరే సంబంధాలివి? ప్రసాదుకూ నాకు పరిచయం తప్ప యింకేమీ లేవు.

* * *

ఇలాంటి నిజాయితీలేని ఆహ్వానాలో ఒకటి భోజనానికి కూచోబోతున్నప్పుడు ఎవరైనా వస్తే "రండి రండి భోంచేద్దాం" అన్నది. నిజంగా అవతలవాళ్లు కాళ్లూ చేతులూ కడుక్కుని భోజనానికి సిద్ధపడిపోతే!

ఇట్లా ఆలోచిస్తూంటే ముప్ఫై సంవత్సరాల క్రితం జరిగిన ఓ అల్ప సంఘటన గుర్తుకొచ్చింది. అప్పట్లో రామనాథం, జానబెత్త శీను (పొట్టివాడు) అనిద్దరు మిత్రులుండేవారు. యిద్దరూ దరిద్ర బ్రాహ్మలే. ఓ పూట తిండే రెండోపూటకు వెతుక్కొనే స్థితి. ఓ ఆదివారం ముగ్గురం కలిసున్నా రామనాథం యింట్లో... మధ్యాహ్న భోజనవేళకి రామనాథం "రండిరా భోజనం చేద్దాం" అని పిలిచాడు. నాకతని పరిస్థితి తెలిసి 'ఇంటికెళ్తా' అన్నా. జానబెత్త శీనుగాడు మాత్రం 'ఆహా భోజనం దొరికింది కదా' అని సిద్ధపడిపోయాడు. రామనాథం మొహం చూడాలి... అక్కడ అతనికి సరిపడా మాత్రమే అన్నం వుంది... ఆహ్వానించిన నేరానికి జానబెత్త శీనుగాడికి భోజనం పెట్టి తను ఓ బెల్లపచ్చు నమిలి చెంబుడు నీళ్లు తాగి కడుపు నింపుకున్నాడు.

ఎంత సంకటం! ఎంత దుర్భరం!

ఏ మర్యాదలూ ఏ భేషజాలూ లేకుండా "మీరు కూచోండిరా నేను భోజనం చేసొస్తా" అని రామనాథం ఎందుకని అనలేకపోయాడు?

ఏమో మిధ్యా విలువలు అని నేనంటూన్నా వీటి వెనక మన సంస్కృతీ సంప్రదాయాలు మానవ సంబంధాల పటిష్టత కోసం ఏర్పరచిన సూత్రమేదైనా వుందేమో... ఉండి వుండవచ్చు. కానీ అప్పుడు ఉన్నవీ యిప్పుడు లేనివీ వనరులూ... కాలమూ... నిజాయితీ. ●